సాక్షి
కుమురం భీం
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

## న్యూస్‌రీల్

### ఘనంగా ధన్వంతరి మహర్షి జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం భవనంలో ఆదివారం పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్, నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎలగందుల సందీప్, సత్యనారాయణ, సిద్దేశ్వర్, శంకర్, దీపక్, విలాస్, చరణ్ పాల్గొన్నారు.

### వాంకిడి చెక్‌పోస్టుపై ఏసీబీ దాడి

- రూ.5,100 నగదు స్వాధీనం

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని రాష్ట్ర సరిహద్దులో ఉన్న రవాణా శాఖ చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు శనివారం అర్ధరాత్రి దాడి చేసి లెక్కకు మించి అధికంగా ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. చెక్‌పోస్టు సిబ్బంది వాహనదారుల నుంచి నిర్ణీత రుసుం కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో చెక్‌పోస్టులో తనిఖీలు చేపట్టడం ఇది రెండోసారి. శనివారం రాత్రి నిర్వహించిన దాడులల్లో లెక్కకు మించి రూ.5,100 అధికంగా నగదు లభ్యమైనట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

### హాస్టల్ వర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి వివేక్ వెంకటస్వామి ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మంత్రి పీఏ రాకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టీకం ప్రభాకర్ మాట్లాడుతూ జీవో 69 రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు వెలిశాల కృష్ణమూర్తి, యూనియన్ జిల్లా కార్యదర్శి శ్యాంరావు, కోశాధికారి రాంబాయి, ఉపాధ్యక్షురాలు హీరాబాయి, నాయకులు తార, జంగుదేవి, బాపురావు, అరిగెల కోటయ్య, శ్యామల, పద్మ, సముద్రబాయి, తదితరులు పాల్గొన్నారు.

### 'సేవ చేయడమే లక్ష్యం'

కౌటాల: పేద ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని జిల్లా క్లబ్ గవర్నర్ ఎస్. కోదండ రామ్ అన్నారు. ఆదివారం కౌటాల మయూరి విద్యాలయంలో కౌటాల లయన్స్ నూతన క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు క్లబ్‌లో సభ్యులుగా చేరాలన్నారు. లయన్స్ క్లబ్ సేవలను మారుమూల ప్రాంతాలకు విస్తరిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్‌పర్సన్ కొత్తపల్లి శ్రీనివాస్, కో చైర్‌పర్సన్ పెద్దపల్లి కిషన్ రావ్, అధ్యక్షుడు శాగంటి యాదగిరి, కార్యదర్శి తిరుపతి చారి, కోశాధికారి దుర్గం గోపాల్, సభ్యులు పాల్గొన్నారు.

### వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై కల్యాణ్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఆరెగూడ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం వాలీబాల్ పోటీలను ఈజ్‌గాం ఎస్సై కల్యాణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, నాయకులు పురుషోత్తం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుల పండుగ

- నేడు దీపావళి
- లక్ష్మీదేవి పూజలకు ఏర్పాట్లు
- రంగు రంగుల విద్యుద్దీపాలతో గృహాలు, షాపులు అలంకరణ



జిల్లా కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ప్రమిదలు

ఆసిఫాబాద్‌అర్బన్: జ్ఞానానికి.. శుభానికి ప్రతీక దీపం. అందుకే ప్రతీ శుభకార్యాన్ని జ్యోతి ప్రజ్వలనతోనే ప్రారంభిస్తాం. అజ్ఞానమనే చీకటిని తరిమి జీవితాలను జ్ఞానకాంతితో నింపే మహోత్సవమే దీపావళి. ఆశ్వయుజ బహుళ అమావాస్య సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా ఈ వెలుగుల పండుగ జరుపుకోనున్నారు. ధనలక్ష్మీ పూజలు, బొమ్మల కొలువులు, బంగారం కొనుగోళ్లతో సందడి నెలకొంది. ఇళ్లతోపాటు వ్యాపార సముదాయాల్లో లక్ష్మీదేవి పూజలు, కేదారీశ్వర నోములు నిర్వహించనున్నారు. ఇంటి ఎదుట మామిడి తోరణాలు, పూలదండలు, రంగురంగుల విద్యుత్ లైట్లు, దీపప్రమిదలతో అలంకరించనున్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన మార్కెట్లు ఆదివారం సందడిగా మారాయి. గృహాల అలంకరణకు అవసరమైన సామగ్రిని కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపారు. ధనలక్ష్మీ పూజలు, నోములు, వ్రతాలు, టపాసుల కొనుగోలు చేశారు.

**పండుగ నేపథ్యం...**

ద్వాపర యుగంలో ప్రాజ్యోతిష్యపురాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలించిన నరకాసురుడు దేవ, మానవ జాతిని తీవ్ర ఇబ్బందులకు గురి చేసేవాడు. ధర్మానికి భంగం కలిగించే అతని చర్యలను సహించలేని భూమాత, దేవతలు, ప్రజలు శ్రీకృష్ణుడికి విన్నవించుకుంటారు. అప్పుడు కృష్ణుడు సత్యభామతో కలిసి ఆశ్వయుజ చతుర్దశి రోజు నరకాసురుడిని అంతం చేస్తాడు. ఇదే 'నరక చతుర్దశి'గా మారింది. నరకాసుర వధ అనంతరం నగరానికి తిరిగి వచ్చిన సత్యభామ, కృష్ణుడికి అమావాస్య నాడు ప్రజలు దీపాలు వెలిగించి మంగళ హారతులతో స్వాగతం పలికారు. అప్పటి నుంచి దీపావళిని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

**దీపాల వెలుగులు.. బాణాసంచా మోతలు**

దీపావళి సందర్భంగా వివిధ ఆకృతుల్లో ఉన్న ప్రమిదలతో వరుసగా నాలుగు రోజులపాటు దీపాలు వెలిగిస్తారు. అమావాస్య తిథి లక్ష్మీదేవికి ఇష్టం కావడంతో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని ఆహ్వానిస్తే ధనలక్ష్మీ కృప ఉంటుందని నమ్ముతారు. అనంతరం వివిధ రకాల బాణాసంచాను కాల్చి చిన్నా పెద్దా తేడా లేకుండా ఆనందంగా గడుపుతారు.

### జాగ్రత్తలు పాటించాలి



కాంతిలాల్ పాటిల్, ఎస్పీ

ఆసిఫాబాద్: దీపావళి టపాసులు కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులు, యువత తల్లిదండ్రుల పర్యవేక్షణలో టపాసులు కాల్చాలని, ప్రమాదకరమైన వాడొద్దని సూచించారు. ప్రజల భద్రతకోసం పోలీసులు నిత్యం విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. దీపావళి పండుగను ఆనందం, వెలుగుల పండగగా సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

### ఆనందోత్సాహాల పండుగ



ఆశ్వయుజ బహుళ చతుర్దశి రోజును నరక చతుర్దశిగా పిలుస్తారు. దుర్మార్గుడి పేరుతో ఏర్పడిన ప్రత్యేకత నరక చతుర్దశికి ఉంది. స్త్రీలతో అమర్యాదగా ప్రవర్తించే వారికి శిక్ష తప్పదనే సందేశం ఈ పండుగ ఇస్తుంది. యుద్ధంలో నరకాసురిడిని సంహరించడంతో రాక్షస పీడ వదిలిందని ప్రజలు ఆనందోత్సాహాలతో దీపావళి జరుపుకొంటారు.

– ఒజ్జల శిరీశ్‌శర్మ, పురోహితులు



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



జిల్లా కేంద్రంలో బాణాసంచా దుకాణాలు

# అక్రమ కేసులు సరికాదు




కాగజ్‌నగర్‌టౌన్: సాక్షి మీడియాపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయిస్తోందని జిల్లాలోని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. నిజాలను నిర్భయంగా రాసే పత్రికలపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయ్‌రెడ్డి, ఇతర జర్నలిస్టులపై అక్రమంగా కేసులు పెట్టడం సరికాదని హితవు పలికారు.

### బెదిరింపులు మానుకోవాలి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జర్నలిస్టులను బెదిరించే ధోరణి మానుకోవాలి. సమాజంలో జరిగే వాస్తవాలు బయటపెడుతున్న పత్రికలపై కక్ష సాధించడం తగదు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు సరికాదు. ఇకనైనా ప్రభుత్వం దాడులను ఆపాలి.

– వైద్య శాంతికుమారి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు

### తీవ్రంగా ఖండిస్తున్నాం



నిజాలను నిర్భయంగా నిగుతేల్చే వార్తలు రాసే జర్నలిస్టులపై అక్రమంగా కేసులు బనాయించడం సరికాదు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుంది. తప్పులను ఎత్తిచూపే హక్కు పత్రికలకు ఉంది. సాక్షి జర్నలిస్టులపై పోలీసులతో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– సోయం చిన్నన్న, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### కేసులు ఎత్తివేయాలి



ప్రజల వాణిని వినిపించే మీడియా గొంతు నొక్కడం సరికాదు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. నోటీసుల పేరుతో పోలీసులు సాక్షి కార్యాలయం వద్ద హంగామా చేయడం అప్రజాస్వామికం. ఎడిటర్‌తోపాటు జర్నలిస్టులపై కేసులు ఎత్తివేయాలి.

– ఎన్నం నాగార్జున, ఓయూ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి

# ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన తలాండి శ్రావణిని నిండు గర్భిణి అని చూడకుండా హత్య చేసిన శివార్ల సత్తయ్యను ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ప్రవేశపెట్టి త్వరగా శిక్షించాలని గోండ్వాన కోయ ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నన్న డిమాండ్ చేశారు. గెర్రె గ్రామంలో శ్రావణి మృతదేహానికి ఆదివారం నివాళులర్పించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని అక్కడే ఉన్న కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్‌కి వినతిపత్రం అందించారు. చిన్నన్న మాట్లాడుతూ ఇది ముమ్మాటికి కులోన్మాద హత్య అని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కుల వివక్షను నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఆదివాసీ సంఘాల నాయకులు ఓం ప్రకాశ్, కోట సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' గ్రామ సభలకు శ్రీకారం

- 2026- 27 ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ సిద్ధం
- ప్రారంభమైన గ్రామసభలు
- గ్రామస్తుల అంగీకారంతో పనులు గుర్తింపు



కెరమెరి మండలం జోడేఘాట్‌లో గ్రామసభలో చర్చిస్తున్న అధికారులు, గ్రామస్తులు(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధిహామీ పథకం కింద 2026- 27 సంవత్సరంలో చేపట్టాల్సిన పనులకు డీఆర్‌డీవో అధికారులు కార్యాచరణ సిద్ధం చేశా రు. ఈ నెల 11 నుంచి గ్రామసభలు నిర్వహిస్తూ స్థానికుల అంగీకారంతో పనులు గుర్తిస్తున్నారు. ఈ ప్రక్రియ నవంబర్ వరకు కొనసాగనుంది. ఆ తర్వాత అధికారులు జిల్లాలో కూలీలకు అవసరమైన మేరకు పనులు కల్పించేందుకు లక్ష్యం నిర్దేశించనున్నారు. అక్టోబర్ 2 నుంచే గ్రామ సభలు ప్రారంభించాల్సి ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమైంది.

**ఇప్పటి నుంచే పనులు గుర్తింపు**

2025- 26 ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. 2026- 27లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తిస్తున్నారు. జిల్లాలో యాక్టీవ్ జాబ్‌కార్డులు 62వేలు ఉండగా, 1,06,000 మంది కూలీలు పనిచేస్తున్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో పని దినాల లక్ష్యం 20.86 లక్షలు కాగా, ఇప్పటివరకు 21.78 లక్షల పనిదినాలు పూర్తిచేశారు. కూలీలకు రూ.52.59 కోట్లు చెల్లించారు. 2026- 27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించేందుకు జిల్లాలోని 335 పంచాయతీల్లో నవంబర్‌లోపు గ్రామసభలు పూర్తి చేయనున్నారు. మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించి జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపిస్తారు.

**కూలీలకు వందరోజుల పని..**

ఉపాధిహామీ కూలీలకు ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పనిదినాలు కల్పించాలనే ప్రభుత్వ ఉద్దేశం. కూలీలు అడిగిన 14 రోజుల్లోగా పని కల్పించాలి. ఎస్‌ఐసీ సాఫ్ట్‌వేర్ వివరాలు నమోదైతే పని కల్పించాల్సిందే. లేకుండా నిరుద్యోగ భృతి చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగానే ప్రణాళిక ప్రకారం గ్రామాలకు అవసరమైన పనులు గుర్తిస్తున్నారు. ప్రజల అంగీకారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నారు. పనులకు అయ్యే ఖర్చుల వివరాలతో నివేదికలు రూపొందించి తీర్మానాలు చేస్తున్నారు.


### నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం

రానున్న ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పనుల కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత నివేదిక రూపొందిస్తాం. వచ్చే ఏడాది నీటి సంరక్షణ పనులకు తొలి ప్రాధాన్యత ఇస్తాం. అలాగే వ్యవసాయ అనుబంధ మొక్కలు పెంపకం, వ్యక్తిగత అభివృద్ధి పనులు, పశువుల షెడ్ల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, కోళ్లఫాం, ఫిష్‌పాండ్‌ల నిర్మాణానికి అవకాశం కలిస్తాం.

– దత్తారావు, డీఆర్‌డీవో

# వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

- 17 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వహీదుద్దీన్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పోలీస్ డివిజన్‌లో గతేడాది నుంచి వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ వహీదుద్దీన్ వివరాలు వెల్లడించారు. 2024 అక్టోబర్ 30న కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన బొల్లు ప్రసాద్ ఇంట్లో చోరీ జరిగింది. పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. పట్టణంతోపాటు సిర్పూర్, కౌటాల, చింతలమానెపల్లి, డబ్బా గ్రామంలో జరిగిన ఐదు దొంగతనాల్లో మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా శ్యాంనగర్‌కు చెందిన గౌతం విశ్వాస్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి 17 తులాల బంగారంతోపాటు వెండి స్వాధీనం చేసుకున్నారు. అలాగే గడ్చిరోలి జిల్లాకు చెందిన సమీర్ మండల్‌తో కలిసి గౌతం విశ్వాస్ రాత్రి సమయాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతుంటాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం సమీర్ మండల్ వేరే కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్నాడని, అతడిని కస్టడీలో తీసుకుని విచారించనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఆయన అభినందించారు. సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు ప్రేంకుమార్, కుమారస్వామి, ఎస్సైలు సుధాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తు గడువు పొడిగింపు

- ఈ నెల 23 వరకు పెంపు
- 27న మద్యం దుకాణాలకు లక్కీడ్రా
- శనివారం ఒక్కరోజే 242 దరఖాస్తులు



మద్యం టెండర్లు వేసేందుకు వచ్చిన వ్యాపారులు

ఆసిఫాబాద్: బీసీ బంద్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకు పొడిగించింది. ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో లక్కీడ్రా నిర్వహించనున్నారు. గత నెల 26న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదట మందకొడిగా దరఖాస్తులు రాగా నాలుగు రోజులుగా ఊపందుకున్నాయి. శనివారం జిల్లాలోని వ్యాపారులు అర్ధరాత్రి వరకు దరఖాస్తులు సమర్పించారు. ఈ నెల 15న 47 దరఖాస్తులు, 16న 46, 17న 165, 18న 242 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల సంఖ్య 622కు చేరింది. ప్రభుత్వానికి రూ.18.66 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా గూడెం షాపునకు 63 దరఖాస్తులు రాగా, వాంకిడి 007 దుకాణానికి 45, వాంకిడి 008 దుకాణానికి 43, గోయగాం(తిర్యాణి) 46, గోయగాం(కెరమెరి) 46, దహెగాం షాపునకు 44 దరఖాస్తులు వచ్చాయి. రెబ్బెన, గోలేటి, జైనూర్(030, 031), సిర్పూర్(యూ), కాగజ్‌నగర్(014, 015, 016, 018), కౌటాల(023) షాపులకు మాత్రం పదిలోపే దరఖాస్తులు వచ్చాయి. కాగా, జిల్లాలోని మద్యం దుకాణాలకు 2019లో 763 దరఖాస్తులు రాగా, 2021లో 643, 2023లో 1020 దరఖాస్తులు వచ్చాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి దరఖాస్తుల సంఖ్య తగ్గినా 90 శాతం వరకు ఆదాయం వచ్చింది.

**లక్కీడ్రాకు ఏర్పాట్లు**

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు ఈ నెల 23వరకు పెంచిన నేపథ్యంలో ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు లక్కీడ్రా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోవాలి. దరఖాస్తుతోపాటు ఎక్సైజ్ శాఖ అధికారులు ఇచ్చిన రశీదును తీసుకురావాలని అధికారులు సూచించారు. దరఖాస్తుదారు రాలేని పక్షంలో ఆథరైజేషన్ లెటర్ ఉన్న వ్యక్తులను అనుమతిస్తారు. ఇందుకు సంబంధించిన ఎంట్రీ పాసులను అందజేస్తారు. లక్కీడ్రా నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీరు, జనరేటర్, మైక్ సెట్ తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన గెజిట్ ప్రకారం సీరియల్ నంబర్ 1 నుంచి లక్కీడ్రా తీయనున్నారు. మధ్యాహ్నం వరకు దుకాణాల కేటాయింపు పూర్తి కానుంది.


# 'గిరి' గూడేల్లో దండారీ సందడి




చౌపన్‌గూడలో గుస్సాడీ నృత్యం..

దండారీ ఉత్సవాలతో ఆదివాసీ గూడేలు సందడిగా మారుతున్నాయి. డప్పుచప్పుళ్లతో మార్మోగుతున్నాయి. కాళ్లకు గజ్జెలు, ప్రత్యేక వేషధారణతో చేసే సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఐదు రోజుల క్రితమే జిల్లావ్యాప్తంగా దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 347 దండారీ బృందాలు ఉన్నాయి. ఆదివారం కెరమెరి మండలంలోని పలు గ్రామాల్లో గుస్సాడీ నృత్యాలు కనువిందు చేశాయి. వినోద నాటికలు చూపరులను ఆకట్టుకున్నాయి. చౌపన్‌గూడకు చెందిన దండారీలు చిన్నసాకడ దండారీకి ఆతిథ్యమివ్వగా, హట్టి గ్రామానికి చెందిన వారు మెట్టపిప్రి గ్రామం నుంచి వచ్చిన వారికి ఆతిథ్యమిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో యాదేశా, చిత్రు, దందు, దౌలత్‌రావు, కుసుంబ్‌రావు, మోతీరాం, బొజ్జు, దంబిరావు, ఆనంద్‌రావు, సుంగు, నగేశ్, గోవింద్‌రావు, మృత్‌రావు, జగ్గెరావు, భీంరావు, జంగు తదితరులు పాల్గొన్నారు.


– కెరమెరి



భజన చేస్తున్న కళాకారులు



హట్టిలో సంప్రదాయ నృత్యం చేస్తున్న మహిళలు



చౌపన్‌గూడలో కోలా ఆడుతున్న యువకులు

## క్లుప్తంగా

### ఉడుము స్వాధీనం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామానికి చెందిన పశువుల కాపరులకు శనివారం రాత్రి సుబ్బరాంపల్లి మూలమలుపు వద్ద ఉడుము కనిపించడంతో పట్టుకున్నారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఉడుమును స్వాధీనం చేసుకున్నారు. చెన్నూర్‌లోని అటవీశాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి పశువైద్యుడితో పరీక్షలు నిర్వహించారు. ఉడుము ఆరోగ్యంగా ఉందని తేలడంతో చెన్నూర్ అటవీప్రాంతంలో వదిలేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో సదానందం తెలిపారు.

### పత్తి చేలపై అడవి పందుల దాడి

కోటపల్లి:మండలంలోని పిన్నారం గ్రామంలో పత్తి చేలపై ఆదివారం తెల్లవారం జామున అడవిపందులు దాడిచేసి నాశనం చేశాయని బాధిత రైతులు తెలిపారు. మండలంలో రైతులు అడవి పందులకారణంగా తీవ్రంగా నష్టపోతున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లాకార్యదర్శి మంత్రి రామయ్య ఆరోపించారు. పిన్నారంలో ఓ రైతు 14 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేయగా సగం పంటను అడవి పందులు నాశనం చేశాయని తెలిపాడు. బాధిత రైతుకు పరిహారం అందేలా చూడాలని కోరారు.

### యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు సోమగూడెం యువకుడు



ఎంపికైన యువకుడు శంకర్

కాసిపేట:మండలంలోని సోమగూడెంకు చెందిన గురునాథం శంకర్ యూనివర్సిటీస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బాదె శేఖర్ తెలిపారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న శంకర్ ఈనెల 18న హన్మకొండలో జరిగిన కాకతీయ యూనివర్సిటీ అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో ప్రతిభకనబర్చాడు. హైదరాబాద్‌లో జనవరిలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో శంకర్ కాకతీయ యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈసందర్భంగా కోచ్‌తోపాటు తోటి క్రీడాకారులు శంకర్‌ను అభినందించారు.

# జన్నారం అందాలు చూసొద్దాం..

- వన్యప్రాణులు, పక్షుల సందడి
- మొదలైన జంగిల్ సఫారీ
- పెరిగిన పర్యాటకులు
- వీకెండ్‌లో గదులు ఫుల్



అడవిలో పర్యాటకులు



హరిత రిసార్ట్‌లో హైదరాబాద్ పర్యాటకులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో అందాలు ఆస్వాదిస్తూ.. వన్యప్రాణులు, రకరకాల పక్షులు, జంగిల్ సఫారీ ప్రయాణం ద్వారా పర్యాటకులు వీక్షించేందుకు అటవీశాఖ అనుమతి ఇచ్చింది. వర్షాలు తగ్గుముఖం పట్టడడంతో సఫారీ ప్రయాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. మూడు నెలల విరామం తర్వాత అక్టోబర్ 1 నుంచి జంగిల్ సఫారీ మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వచ్చి అడవులు చూసి మురిసిపోతున్నారు. పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం మధ్య గడుపుతున్నారు. వీకెండ్ రోజుల్లో గదులు ఫుల్‌గా ఉంటున్నాయని పర్యాటక అధికారులు పేర్కొంటున్నారు.

**15 రోజుల్లో 600 పైగా మంది**

జంగిల్ సఫారీ మొదలైన 15 రోజుల్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 600 పైగా మంది పర్యాటకులు ఇక్కడకు వచ్చారని అధికారులు తెలిపారు. నిజామాబాద్, హైదరాబాద్ నుంచి బస్సుల్లో వచ్చి ఇక్కడ సందడి చేస్తున్నారు. రాత్రి హరిత రిసార్ట్‌లో బస చేసి ఉదయం జంగిల్ సఫారీ ద్వారా వన్యప్రాణుల పరుగులు, పచ్చని అడవులను ఆస్వాదిస్తున్నారు. అటవీశాఖ ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపు, అధ్యయన కేంద్రాలను పరిశీలిస్తున్నారు. అడవుల్లో నిర్మించిన కుంటల్లో పక్షుల కిలకిలలు చూసి మురిసిపోతున్నారు.

**చెడిపోయిన దారులు..**

గేట్ నంబర్ 1 నుంచి సుమారు 15 కి.మీ దూరం సఫారీ ప్రయాణం ఉంటుంది. గొండుగూడ బేస్‌క్యాంపు, బైసన్‌కుంట ప్రాంతాల్లో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, అడవి దున్నలు, రకరకాల పక్షులు ఎక్కువగా కనిపిస్తాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో సఫారీ దారి చెడిపోయినట్లు పర్యాటకులు పేర్కొంటున్నారు. అటవీశాఖ దృష్టిసారించి సఫారీ దారిని బాగు చేయిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు సైతం కల్పించాలని కోరుతున్నారు.

### రెండోసారి వచ్చాను



జన్నారం అడవులకు రావడం ఇది రెండోసారి. ఇక్కడ అందాలు చాలా బాగుంటుంది. సఫారీలో వెళ్లేటప్పుడు చుక్కలు దుప్పులు, నీలుగాయి పరుగులు కనువిందు చేశాయి. మా గ్రూప్ సభ్యులందరూ వాటిని చూసి మురిసిపోయారు.

– వినీత, హైదరాబాద్

### 17 రకాల పక్షులను గుర్తించాను



సఫారీ ప్రయాణంలో వివిధ రకాల పక్షులు కనిపించాయి. ఇందులో విదేశీ పక్షులు ఉన్నాయి. బైసన్ కుంట ప్రాంతంలో 17 రకాల పక్షులను గుర్తించాను. ఫొటోలు కూడా తీశాను. బైసన్‌కుంటలో పక్షులు అవాసం ఏర్పాటు చేసుకున్నాయి. అడవులు చాలా బాగున్నాయి. – సంకలిత దేలినాథ్

### పర్యాటకుల సంఖ్య పెరిగింది



సఫారీ మొదలై 15 రోజుల్లోనే పర్యాటకుల సంఖ్య పెరిగింది. వీకెండ్‌లో గదులు నిండిపోతున్నాయి. ఆన్‌లైన్‌లోనే బుకింగ్ చేసుకుంటున్నారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ నుంచి చాలామంది వస్తున్నారు.

– వీరేందర్, హరిత మేనేజర్

# వార్డెన్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజగోపాల్

లక్సెట్టిపేట:మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్, నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన రాజగోపాల్ ఈనెల 18న సాయంత్రం తన ఇంటి వద్ద యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17న ఇంటికి వెళ్లిన రాజగోపాల్... 18వ తేదీ సాయంత్రం బాత్‌రూంలోకి వెళ్లి యాసిడ్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను 100 నుంచి 252కి పెంచేలా రాజగోపాల్ కృషి చేశాడు. అయితే ఆమేరకు బిల్లులు రాకపోవడంతో రూ.7 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేశాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు కూడా తెలిపారు. అయినా బిల్లులు రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. దీనిపై సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చాతరాజు దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నిర్మల్‌కు వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు. ఏఎస్‌డబ్ల్యూవో సురేశ్‌ను వివరణ కోరగా ఈనెల 17న తన తల్లి ఆరోగ్యం బాగాలేదని రాజగోపాల్ ఇంటికి వెళ్లినట్లు తెలిపారు.

### వ్యక్తిపై కేసు

చెన్నూర్: సోషల్‌మీడియాలో మైనింగ్ అధికారిపై అసత్య, అసభ్య ఆరోపణలు చేసిన పట్టణానికి చెందిన ముత్యాల రవికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు. మైనింగ్ అధికారి రామకృష్ణ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎవరి మనోభావాలు దెబ్బతీసేలా, కుల మతాలపై రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# చెదరని నెత్తుటి జ్ఞాపకాలు



ఖానాపూర్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమరవీరుల స్మారక స్తూపం

- నాటి నక్సలైట్ల దాడుల్లో 19 మంది పోలీసుల దుర్మరణం
- అమరుల కుటుంబాల్లో తీరని శోకం
- రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

ఖానాపూర్: ఉమ్మడి రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు నేటికి చెదరని నెత్తుటి చేదు జ్ఞాపకాలు.. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకీ మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట నక్సలైట్ల విధ్వంసాలు, తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి. వారి కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. వారి సేవలు మరువలేనివి. ఈక్రమంలోనే ఎన్నో సంఘటనలు జరిగాయి. 1983 నుంచి అప్పటి ఆదిలాబాద్‌లో ఉన్న నిర్మల్ జిల్లా పరిధిలో నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచే కార్యకలాపాలు నడిపేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఖానాపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో ఉన్న 19 మంది పోలీసులు నక్సలైట్ల తూటాలకు బలయ్యారు. వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ఈనెల 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సాక్షి కథనం.

ఉమ్మడి రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు నేటికి చెదరని నెత్తుటి చేదు జ్ఞాపకాలు.. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎటుచూసినా అన్నల అలజడి.. తుపాకీ మోత చప్పుళ్లు వినబడుతుండేవి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట నక్సలైట్ల విధ్వంసాలు, తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతుండేవి. వారి కవ్వింపు చర్యలను తిప్పికొట్టే ప్రయత్నాల్లో పలువురు పోలీసులు అమరులయ్యారు. వారి సేవలు మరువలేనివి. ఈక్రమంలోనే ఎన్నో సంఘటనలు జరిగాయి. 1983 నుంచి అప్పటి ఆదిలాబాద్‌లో ఉన్న నిర్మల్ జిల్లా పరిధిలో మెల్లమెల్లగా నక్సలైట్ల ప్రభావం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో నక్సలైట్ల తూటాలకు 19 మంది పోలీసులు బలయ్యారు. ఖానాపూర్ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో నక్సలైట్లు స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచే కార్యకలాపాలు నడిపేవారు. జిల్లాలో మొదటిసారిగా ఇక్కడి నుంచే నక్సలైట్లు విద్రోహచర్యలకు శ్రీకారం చుట్టారు.

**ఖానాపూర్‌లో అమరుల స్తూపం**

ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమవీరుల స్మారకార్థం స్తూపం లేదు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేపచెట్టు కింద కొన్నేళ్లుగా శిలాఫలకంపై పేర్లు రాసి ఉంచారు. 2008లో అప్పటి సీఐ, ఎస్సైలు స్మారక స్తూప నిర్మాణానికి కృషిచేశారు. ప్రస్తుత సీఐ అజయ్‌తోపాటు ఎస్సై రాహుల్ గైక్వాడ్ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

**సంఘటనల వివరాలివే..**

- 1987 ఆగస్టు 18న కడెం మండలం అల్లంపల్లి క్యాంపునకు పోలీసులు నడిచివెళ్తుండగా అద్దాల తిమ్మాపూర్ వద్ద 30 మంది నక్సలైట్లు పకడ్బందీ పథకం ప్రకారం మాటువేసి విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఇద్దరు ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, ఏడుగురు కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు కానిస్టేబుళ్లు తప్పించుకొని ప్రాణాలు కాపాడుకున్నారు. గంధం రామస్వామి ఉరఫ్ సాగర్ అనే దళ కమాండర్ నేతృత్వంలో ఈ దాడి జరిగింది. ఘటన స్థలాన్ని అప్పటి సీఎం ఎన్టీఆర్ పరిశీలించారు. జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటించి గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.
- 1989 ఫిబ్రవరి 1న జరిగిన సంఘటనకు ఒక రోజు ముందు ఖానాపూర్ మండలం రాజూరా గ్రామంలో నక్సలైట్లు దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు ఆ గ్రామానికి వెళ్తుండగా కడెం మండలం సింగాపూర్ సమీపంలో పకడ్బందీ వ్యూహంతో నక్సలైట్లు పోలీసుల జీపును పేల్చివేశారు. ఎస్సై ఖాదర్‌ఉల్‌హక్, ఆరుగురు కానిస్టేబుళ్లు జి.బాపురావు, ఎండీ జలీల్, శేక్ హైదర్, వేణుగోపాల్, భోజారావు, ఎస్.మోహన్‌దాస్ ప్రాణాలు కోల్పోయారు. ఒకే కానిస్టేబుల్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- 1999 డిసెంబర్ 5న కడెం మండలంలో బందోబస్తుకు వెళ్లి పోలీసులు వస్తుండగా ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామసమీపంలో నక్సలైట్లు రిమోంట్‌కంట్రోలర్ సాయంతో పోలీసులు వెలుతున్న ప్రైవేటు జీపును పేల్చివేశారు. అందులో ప్రయాణిస్తున్న ఎస్సై మల్లేశ్‌తో పాటు కానిస్టేబుల్, ప్రైజీపు డ్రైవర్ దుర్మరణం చెందారు.

### ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



గాలిపల్లి తారక్ (ఫైల్)

భీమారం: ఆర్థిక ఇబ్బందుల కారణంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..భీమారంలోని ఎస్సీ కాలనీకి చెందిన గాలిపల్లి తారక్ (19) మంచిర్యాలలో కొన్ని నెలలుగా కారు మెకానిక్ పని నేర్చుకున్నాడు. శిక్షణ అనంతరం భీమారంలో సొంతంగా కారు మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించున్నాడు. ఈ విషయాన్ని తండ్రి రమేశ్‌కు చెప్పగా అంత డబ్బు లేదని తర్వాత ఏర్పాటు చేద్దామనడంతో తారక్ మనస్తాపం చెందాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో మరో గదిలోకి వెళ్లి తలుపు వేసి గడియ పెట్టుకున్నాడు. అనుమానంతో తండ్రి రమేశ్ తలుపు బాదిన ఎంతకు తీయకపోవడంతో కిటీకి నుంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. తలుపులు బద్దలుకొట్టి వెళ్లి తారక్ కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఘటన స్థలానికి ఎస్సై శ్వేత చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యులను అడిగి వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పాడేటి రవి.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### క్వారీ గుంతలో పడి యువ రైతు మృతి



యాదవ్‌రావు (ఫైల్)

మంచిర్యాల క్రైం: క్వారీలో గుంతలో ప్రమాదవశాత్తు పడి యువ రైతు మృతిచెందినట్లు ఎస్సై మజారోద్దీన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హాజీపూర్ మండలం నాగారం గ్రామానికి చెందిన కొడప గంగు–భారతి దంపతుల కుమారుడు యాదవరావు(25). తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వారికి ఉన్న నాగారం శివారులోని పత్తి చేనులో నీరు పట్టేందుకు శనివారం సాయంత్రం యాదవరావు అక్కడికి వెళ్లాడు. కరెంట్ మోటారుకు మరమ్మతు చేపడుతున్నాడు. ఈక్రమంలో మోటారు పంప్‌ను నీటిలో బిగించేందుకు క్వారీలో దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.